ప్రజాశక్తి
బుధవారం 4 జనవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



నేటి నుంచి అన్ని పాఠశాలల్లో పరీక్షలు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 4 నుంచి 10వరకు సమ్మేటివ్-1 పరీక్షలు నిర్వహించాలని ఎంఇఒ ఎస్ రామచంద్రరావు సూచించారు. సమ్మేటివ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి, పరీక్ష పేపర్లను దిద్ది, మార్కులను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం వివరాలను సంబంధిత విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ సమ్మేటివ్-1 పరీక్షలు నిర్వహించాలని, ఆదేశాలను అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఎంఇఒ రామచంద్రరావు

ఇరిగేషన్ శాఖలో
ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

జిఒ 3 రద్దుపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా నియామక చర్యలు సరికావు

గిరిజన సంఘం నేత అప్పలనర్స



విలేకర్లతో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: ఉద్యోగ భర్తీకి అల్లూరి జిల్లాలో జల వనరుల శాఖ జారీచేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనర్స డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...గిరిజన ప్రాంతంలో నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకే వర్తించే రిజర్వేషన్‌కు సంబంధించిన జిఒ3 రద్దుపైసుప్రీంకోర్టు తీర్పును పున్ణ పరిశీలన చేయాలని గిరిజన సంఘం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉన్న సమయంలో నోటిఫికేషన్ జారీ దారుణమన్నారు. గిరిజనుల పోరాటానికి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం, జిఒ3పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. ఆ రివ్యూ పిటిషన్ పెండింగ్ ఉండగా, గిరిజన యువతకు అన్యాయం చేసే విధంగా వివిధ శాఖలలో ఉద్యోగాలను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పేరుతో, స్థానిక గిరిజనులకు రిజర్వేషన్ కల్పించకుండా రూల్ అప్ రిజర్వేషన్ పేరుతో భర్తీకి చర్యలు చేపట్టడం గిరిజనులను మోసం చేయడమేనని, ఇది రాష్ట్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు.ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)లో పిజిటి/టీజీటీ ఉద్యోగ నియామకాలలో 98 పోస్టులకు గానూ, 26 మాత్రమే ఆదివాసీ అభ్యర్థులకు ఇచ్చారని. మిగతా పోస్టులు అన్ని గిరిజనేతరులతో భర్తీ చేశారన్నారు.

ప్రస్తుతం ఇరిగేషన్ శాఖలో ఉద్యోగాల భర్తీకి కల్లెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో సైతం రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం 6 శాతం మాత్రమే గిరిజనులకు రిజర్వేషన్ కల్పించి, మిగిలిన 94 శాతం ఉద్యోగాలను స్థానికేతర్లకు. కేటాయించారన్నారు. భవిష్యత్తులో షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాలలో స్థానిక గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఈ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పి లక్కు పాల్గొన్నారు.

12న ఐటిడిఎ ముట్టడి



ఆశావర్కర్లతో మాట్లాడుతున్న సిఐటియు నేత సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు : తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఈనెల 12న చేపట్టనున్న ఆశావర్కర్ల ఐటిడిఎ ముట్టడి ఆందోళనను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నేత బొండా సన్నిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆశావర్కర్లు, సిహెచ్‌డబ్ల్యూలతో మాట్లాడుతూ, ఇరవై ఏళ్లకు పైబడి గిరిజన గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశావర్కర్లు, సిహెచ్‌డబ్ల్యూల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి చూపడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్లకు నెలసరి వేతనం రూ.26వేలకు పెంచాలని, ఉద్యోగభద్రత కల్పించడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. వీటి సాధనకు చేపట్టబోయే ఐటిడిఎ ముట్టడిలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

అర్హతలే ప్రామాణికంగా పింఛన్లు

జిల్లాలో 1,25,460 మందికి రూ.34.90 కోట్ల లబ్ధి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - పాడేరు : అల్లూరి జిల్లాలో 1,25,460 మందికి రూ.34.90 కోట్లు వైఎస్ఆర్ పింఛను కానుక పథకం లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పెన్షన్ పంపిణీలో మాట్లాడుతూ, పారదర్శకమైన పాలన ద్వారా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. వైఎస్ఆర్ పింఛను కానుక కింద సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు ఈనెల నుంచి మరో రూ.250 అదనంగా పెంచి లబ్ధిదారులకు నెలకు రూ.2750 అందిస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా అర్హతే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, లబ్ధిదారుల ఇంటి వద్దకు తెల్లి ఇచ్చేలా వాలంటీర్ల వ్యవస్థను వైసిపి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జాయింట్ కలెక్టర్ జె శివ శ్రీనివాసు మాట్లాడుతూ, లబ్ధిదారులకెవరైనా పింఛను అందకపోతే వివరాలను సంప్రదించాలని, సాంకేతిక సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటీసులు అందుకున్నప్పటికీ వారు తగిన కారణాలు తెలియజేస్తే పింఛను కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ డిఎ పిడి మురళి, ఐటిడిఎ ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్.సత్యవేణి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ధర బాగున్నా.. దిగుబడుల్లేక
రాజ్మా రైతుల దిగాలు!



వారపుసంతలో అమ్మకానికి తెచ్చిన రాజ్మా పిక్కలు

ప్రజాశక్తి- జిమాడుగుల: మండల కేంద్రంలో మంగళవారం జరిగే వారపు సంతకు రాజ్మా చిక్కుళ్లు భారీఎత్తున అమ్మకానికి రైతులు తీసుకొచ్చారు. ఈ ఏడాది వర్షాలు, తుపాను ప్రభావంతో రాజ్మా చిక్కుళ్ల పంట బాగా దెబ్బతిందని, దీంతో దిగుబడులు గణనీయంగాతగ్గిపోయాయని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. వారపు సంతలోనే కిలో రాజ్మా ధర రూ.80వరకు పలుకుతోందని, అయితే పంట ఆశించిన స్థాయిలోదిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టపోయామని ఆవేదన చెందుతున్నారు.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

- గిరిజన సంఘం ఆధ్వర్యాన రైతుల ఆందోళన
- రెండేళ్ల బకాయి చెల్లించాలని డిమాండ్



వేలమామిడిలో కాఫీ రైతుల ఆందోళన పాల్గొన్న సర్పంచ్ చిన్నబాబు

ప్రజాశక్తి -అనంతగిరి : కాఫీ పిక్కలకు కనీస గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో కాఫీ రైతులు ఆందోళన చేపట్టారు. అరకు మండలం సుంకమెట్ట సిపిఎం సర్పంచ్ గెమ్మెలి.చిన్న బాబు ఆధ్వర్యంలో అనంతగిరి మండలంలోని పెద్దకోట పంచాయతీ వేలమామిడి కివర్ల పంచాయతీ గ్రామంలో కాఫీ రైతులు ఆందోళన చేశారు. తమకు రావాల్సిన కాఫీ బకాయి చెల్లించాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ, ఏజెన్సీ మండలాల్లో కాఫీ రైతులకు గడచిన రెండు మూడేళ్ల బకాయి సుమారు రూ.60కోట్లు చెల్లించాల్స ఉందన్నారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లోమంచి డిమాండ్, ధర ఉన్న ఈ ప్రాంత కాఫీ గింజలను రకాన్ని బట్టి కిలో రూ.100 నుంచి రూ.300 వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దళారుల బెడద లేకుండా జిసిసి ద్వారా గిట్టుబాటు ధరనిచ్చి కాఫీ కొనుగోలుకు ఐటిడిఎ పిఒ తగు చర్యలు చేపట్టాలని కోరారు. దళారులు, వ్యాపారులకు కాఫీ పిక్కలను అమ్మే అవకాశమే లేకుండా ప్రభుత్వపరంగా కొనుగోలుకు చర్యలు చేపట్టాలని, అలాగే ఇప్పటివరకు ఉన్న కాఫీ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాఫీ రైతు సంఘాల కార్యవర్గం ఎన్నిక

మండలంలోని పెద్దకోట కివర్ల పంచాయతీలలో కాఫీ రైతుల సంఘం ఎన్నిక నిర్వహించారు. సర్పంచ్ గెమ్మిలి.చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కాఫీ రైతుల సమావేశంలో పెద్దకోట పంచాయతీ .అధ్యక్షులుగా బి.సన్యాసిరావు, కార్యదర్శిగా సీదరి సాంబ, ఉప కార్యదర్శిగా తాంబూల. అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా వంతల సుశాంత్, కివర్ల పంచాయతీ అధ్యక్షులుగా పాతని.ఈశ్వరరావు, కార్యదర్శిగా సీదరి. కొండబాబు, ఉప కార్యదర్శిగా పుట్టబోయిన. దేముడు, ఉపాధ్యక్షులుగా వంతల బల్లేశ్వరరావులను ఎన్నుకున్నారు.

108 సిబ్బంది వినూత్న నిరసన



పిహెచ్‌సి వద్ద నిరసన తెలియజేస్తున్న 108 సిబ్బంది

ప్రజాశక్తి -హుకుంపేట: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక పిహెచ్‌సి వద్ద కళ్లను రెండు చేతులతో మూసుకుని 108 సిబ్బంది వినూత్న నిరసన చేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది సంఘం ప్రతినిధులు మాట్లాడుతూసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగాఈ నిరసన చేపట్టామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచి సక్రమంగా చెల్లించడంతోపాటు, ఉద్యోగభద్రత కల్పన, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. తమ ఆవేదన ప్రభుత్వం, అధికార యంత్రాంగం చూడడం, వినిపించుకోకపోవడానికి సంకేతంగా ఇలా వినూత్నంగా నిరసన చేపట్టామన్నారు. మంగళవారం విధులకు వెళ్లే 108 సిబ్బంది ఎక్కడ ఉంటే అక్కడే ఇటువంటి నిరసన చేపట్టి, తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియపరిచే ప్రయత్నం చేశామని వెల్లడించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వే బృందం అడ్డగింత

మళ్లీ వస్తే తరిమికొడతామని గిరిజనం హెచ్చరిక



సర్వే బృందాన్ని అడ్డుకుని వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - అనంతగిరి : హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి స్థల సమీకరణ సర్వేకు వెళ్లిన బృందాన్ని మంగళవారం మండలంలోని పెద్దకోట పంచాయతీ రేగులపాలెం, కుడియా. టముటు, కొండిబకోట, గుజిరి గ్రామాలలో ప్రజలు అడ్డుకుని తిరిగి పంపించారు. పంచాయతీ సచివాలయం బృందం ఆధ్వర్యంలో సర్వేకు సన్నద్ధమౌతుండగా స్థానిక గిరిజనులు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. భూ రీసర్వే వచ్చామని సిబ్బంది చెప్పగా, భూములు సర్వే నిర్వహించే మిషన్లు చూపించాలని గ్రామస్తులు నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపడడంతో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు భూములను కట్టబెట్టేందుకు సర్వేకు వచ్చారా అంటూ నిలదీసి, వెనక్కు వెళ్లిపోవాలని హెచ్చరించారు. మరోసారి అదే ప్రాజెక్టుకు భూముల సర్వేకు వస్తే తరిమికొడతామ గ్రామస్తులు జన్ని. ఈశ్వరరావు .వెంకటరావు .సింహచలం హెచ్చరించారు అనంతరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రాజెక్ట్ సర్వేకు వెళ్ళిన బృందానికి లిఖితపూర్వకంగా వినతి అందజేశారు కార్యక్రమంలో పలు గ్రామాల గిరిజనులు తదితరులు పాల్గొన్నారు

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్రంలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ గనోరే తదితరులు

ప్రజాశక్తి - రంపచోడవరం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రంపచోడవరం మండలం బందపల్లి, ఊట్ల గ్రామాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ముందుగా బందపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ క్యాంపులకు వచ్చిన గర్భిణులను, చిన్నపిల్లల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధిత వ్యాధులకు మందులు అందజేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అన్ని స్కూళ్లను పరిశీలించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యంగా ఉన్న పిల్లలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. మందపల్లి గ్రామపంచాయతీ రేషన్ కార్డులు పెండింగ్‌లో ఉన్న వాటిని ఈకేవైసీ చేయించాలన్నారు. అనంతరం ఊట్ల గ్రామపంచాయతీని కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో తాగునీరు సరిపోవటం లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే కలెక్టర్ స్పందించి తాగునీరు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదన తయారు చేయించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట గ్రామ సచివాలయాల సిబ్బంది, సర్పంచులు ఉన్నారు.

స్పందనకు వచ్చిన సమస్యలను పరిష్కరించాలి

స్పందనకు వచ్చిన సమస్యలన్నీ పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్ని మండలాలకు సంబంధించిన వివిధ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుండి జిల్లాలోని అన్ని మండలాలకు సంబంధించిన వివిధ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు వచ్చిన సమస్యలన్నీ అప్లోడ్ చేసి సంబంధిత దరఖాస్తుదారునికి రసీదులు ఇవ్వాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్‌లను ఎంపీడీవోలు కోఆర్డినేటర్లు నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. రేషన్ కార్డు పెండింగ్‌లో ఉన్న వాటిని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవిన్యూ అధికారులు పరిష్కరించాలని సూచించారు. టూరిజం ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరువేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు డేవిడ్‌రాజు, నాగేశ్వరరావు, వెలుగు ఎపిడి శ్రీనివాసరావు, ఎంపీడీవోలు ఎంవిఆర్ కుమార్ బాబు, వివేక్, డిపిఎం అపర్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య బాబు, రాజేంద్ర బాబు, రంగనాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చింతూరు సబ్ కలెక్టర్ పర్మన్ అహ్మద్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, హౌసింగ్ ప్రాజెక్టర్ డైరెక్టర్ బాలు నాయక్ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమార్కులకు అధికారుల అండ

- గుండాల ర్యాంపులో ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఎటపాక

ఏజెన్సీలో 1/70, పీసా చట్టాలను తుంగలో తొక్కి మండలంలోని గుండాల ఇసుక ర్యాంపులో ఇసుక తవ్వకాలు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటూ రెచ్చిపోతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారులు ఇసుక మాఫియాకు అండదండలు కొనసాగిస్తున్నారా, అధికార పార్టీ నాయకులకు అనుమతులు ఇస్తున్నారా తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. పీసా చట్టానికి వ్యతిరేకంగా జెసిబిలతో నదిలో నుండి ఇసుకను నేరుగా లారీలోకి లోడ్ చేసి రవాణా చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం మనుషులతో లోడ్ చేయించి వారికి ఉపాధి కల్పించాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. వీటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇసుక రవాణాలో వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని పంచాయతీకి ఇవ్వాల్సి ఉండగా అవేవీ చేయలేదన్నారు. ఇసుకను నేరుగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు వే బిల్‌తో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారన్నారు. నిబంధనలు చట్టాలు ఉల్లంఘిస్తున్నారంటూ స్థానికులు, ప్రతిపక్ష పార్టీలు గత కొంతకాలంగా ఆందోళన చేట్టించుకోలేదన్నారు. అధికార పార్టీ నాయకులకు ఇసుక మాఫియాకు భయపడి అధికారులు ఏమీ చేయడం లేదన్నారు. ప్రజా సంపదను దోసుకెళ్తున్నా పట్టించుకోని ప్రభుత్వ తీరుపై, అధికారులు నిర్లక్ష్యంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారని ఆయన హెచ్చరించారు. అక్రమార్కుల గుప్పెట్లో నుండి స్థానిక సొసైటీకు గుండాల ఇసుక ర్యాంపు అప్పగించి, స్థానికులకు ఉపాధి కల్పించే వరకు సిపిఎం పోరాడుతుందని మర్లపాటి నాగేశ్వరరావు తెలిపారు.

గుండాల ర్యాంపు మూసివేయాలని వినతి

ఎటపాక : అక్రమ అనుమతులతో నిర్వహిస్తున్న గుండాల ఇసుక ర్యాంపును తక్షణం మూసివేయాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు వేణుగోపాల్ వినతి పత్రం ఇచ్చారు. గుండాల గ్రామంలో ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి, పీసా గ్రామసభల అనుమతి లేకుండా దొడ్డిదారిన అధికారులను పక్కదారి పట్టించి ఇసుక మాఫీయా రెచ్చిపోతుందని తెలిపారు. ప్రజా సంపదను దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ వి, ఇరపా అజయ్, గద్దల హుస్సేన్, ఇరపా సత్యం, తోట శ్రీను, మాటూరి బాలకష్ణ, ఇరపా హరి, ఇరపా కోటి ఉన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

టిడిపి వినతి

చింతూరు : అల్లూరి సీతారామ జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామంలో అక్రమంగా జరుగుతున్న ఇసుక ర్యాంపుపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం మండల ఎటపాక కమిటీ తరపున ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు అధికారి వారికి విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పుట్టు రమేష్, మాచినేని రాజేష్, వల్లభనేని చందు, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు విజ్జగిరి రవితేజ చింతూరు మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరావు, జి సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ఐటిడిఏ పిఓ చట్ట పరమైన చర్య తీసుకోవడం జరుగుతుందని టిడిపి బందానికి హామీ ఇవ్వడం జరిగింది.



చింతూరు ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేతలు



కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

గండి ప్రదేశంలో కాంక్రీట్ పనులు

ప్రజాశక్తి -సీలేరు

డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి పడిన ప్రదేశంలో కాంక్రీట్ పనులు సోమవారం రాత్రి 10 గంటల నుంచి ప్రారంభించినట్లు ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొదటిగా గండి పూడ్చివేత పనులు పూర్తి చేయడానికి గ్రావెల్‌తో మట్టి పనులు చేపట్టామని, ఈ పనులు సుమారు 20 రోజులు జరిగాయని తెలిపారు. మట్టి పనులు పూర్తి కావడంతో కాంక్రీట్ పనులు చేపట్టామన్నారు. ఇంజనీర్లు పర్యవేక్షణలో నాణ్యత లోపాలు తలెత్తకుండా నిరంతరం పరిశీలిస్తూ పనులు చేపడుతున్నామని తెలిపారు. కెనాల్ లోపల వైపు భాగం కాంక్రీట్ పనులు పూర్తి చేశామని, మరో నాలుగు రోజుల్లో కెనాల్ గండి అవుట్ సైడ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పవర్ కెనాల్ పనులు పూర్తయిన వెంటనే కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా నీటిని నెమ్మది నెమ్మదిగా విడిచి పెడుతూ గోదావరి డెల్టాకు 1000 నుంచి 2000 క్యూసెక్కులు నీటి విడుదల పెంచుతూ 4000 క్యూసెక్కుల వరకు నీటి విడుదల చేస్తామని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

పాఠశాలలను సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఇప్పూరు, ములకపల్లి, ధారపల్లి, జీడిగుప్ప పాఠశాలలను ఎంపీపీ కారం లక్ష్మి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ నేటికి విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకొనే పరిస్థితి ఉందన్నారు. వరదల వల్ల ములకపల్లి పాఠశాల మునిగిపోయిందని, నేటికీ గోడలకు మట్టిపట్టి ఉందని తెలిపారు. పాఠశాలలో ఒకే టీచర్‌ను ఉంచడం వలన వారు సెలవు పెడితే సిఆర్‌పిలు వెళ్లి 2 పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే టీచర్లను నియమించాలని, ములకపల్లి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, యూనిఫామ్ విద్యార్థులకు 4 జతలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, చిన్నమట్టపల్లి ఎం.పి.టి.సి పూనెం.ప్రదీప్ కుమార్, రైతుసంఘం నాయకులు సోయం చినబాబు, పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామూర్తి, వడ్లాది. రమేష్, కదల కొండారెడ్డి, ఖాదర్, నాళ్లారపు ప్రకాష్ రావు, కొమ్మల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మాదిగమల్లులో ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మాణానికి మంగళవారం జీకే వీధి సిఐ అశోక్ కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ, ఎయిర్ టెల్ మేనేజర్ ఎస్‌జి.ప్రసాదు ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో సమాచార వ్యవస్థని అందుబాటులో తీసుకొచ్చి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సెల్ టవర్ నిర్మాణంతో ఇంటర్నెట్ సెల్ సౌకర్యం కల్పించడానికి చొరవ చూపిన పోలీసు అధికారులకు రుణపడి ఉంటామని గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సెల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

పారదర్శకంగా అంగన్‌వాడీ నియామకాలు

– గిరిజన సంఘం మండల కార్యదర్శి శ్రీను డిమాండ్

ప్రజాశక్తి –ముంచింగిపుట్టు:మండలంలో ఐసిడిఎస్ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా జరపాలని మండల గిరిజన సంఘం కార్యదర్శి ఎంఎం శ్రీను ప్రభుత్వాన్ని, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి రాజేశ్వరిని కోరారు. మండలంలో మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయా పోస్టులు మొత్తం తొమ్మిది భర్తీకి ఐటీడీఏ నోటిఫికేషన్ జారీ చేశారు. వీటికి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల జాబితాలను గురువారం వెల్లడించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని కోరారు. మండలంలోని అధికార వైసిపి నేతలు అధికారులను ప్రలోభపెట్టి, తమకు అనుకూలురికి, ఆసుయాయులకు ఈ పోస్టులను కట్టబెట్టేలా ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అర్హులకు అన్యాయం జరగకుండా నియామక యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హత కలిగినా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిపినా, నియామకాలు వచ్చేసరికి ఒత్తిళ్లకు ప్రభావిత చేయనున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీల నియామకాల్లో అర్హులకు అన్యాయం జరిగితే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి, ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గిరిజన సంఘం నాయకులు త్రినాథ్, భీమరాజు, రామదాసు, క్రిష్ణ పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ

రెండో రోజుల్లో తల్లుల బయోమెట్రిక్ పూర్తి

ప్రజాశక్తి- పెదబయలు : రెండు రోజుల్లో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వెరిఫికేషన్, తల్లుల బయోమెట్రిక్ శతశాతం పూర్తి చేయాలని డిప్యూటీ డిఇఒ కొండలరావు ఆదేశించారు. మంగళవారం పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల హెచ్‌ఎంలు, వార్డెన్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాల్లో సందర్శించి, బడికిరాని, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి తిరిగి వారిని బడిబాట పట్టించాలని ఆదేశించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు నేరుగా ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనం అమలును పర్యవేక్షించాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రతి వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రీవెన్స్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆశ్రమాల్లో ఎఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం చూపకుండా, ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఎ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, రెండు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇంటర్ మీడియా స్పోర్ట్స్ ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్, విస్టా ఆధ్వర్యాన చేపట్టిన ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌ను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మంగళవారం పోర్టు అవుట్ డోర్ మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరం సమాజానికి సేవలందించే జర్నలిస్టులు క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం మెరుగుపడటంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రముఖ బాక్సింగ్ కోచ్ మానస మాట్లాడుతూ, జర్నలిస్టుల క్రీడల్లో తనను భాగస్వామ్యం చేయడం సంతోషం కలిగిస్తుందన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఈ క్రీడా సంబరాలు పది రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న మెగా క్రికెట్ టోర్నీలో పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం చేస్తామన్నారు. విస్టా అధ్యక్షుడు ఉమాశంకర్‌బాబు క్రీడల వివరాలు, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్ ప్రారంభంలో భాగంగా తొలుత కమిషనర్ గాలిలోకి బెల్లూన్లు ఎగరవేసి అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలి రోజు నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ హోరాహోరీగా సాగింది. నాలుగు జట్లుగా 44 మంది జర్నలిస్టులు ఇందులో పాల్గొన్నారు. పురుష, మహిళలకు వంద, రెండు వందల మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్‌తో పాటు వివిధ పోటీలు నిర్వహించారు.

కూలిన పిహెచ్‌సి ప్రహరీ!

నాసిరకంగా నాడు - నేడు పనులు

అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం!

ప్రజాశక్తి –అనంతగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పాత భవనాలకు కొత్తగా హంగులు దిద్దాలనే లక్ష్యంతో తలపెట్టిన నాడు నేడు పనులకు అనంతగిరి మండలంలో నాణ్యత లోపం వెక్కిరిస్తుంది. లక్షలు ఖర్చుపెట్టి భవనాలను, ప్రహరీలు ఆకర్షణీయంగా తయారుచేసి ప్రజలకు చేరువు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణలోపం కారణంగా మండలంలో కార్యరూపం దాల్చడం లేదనే చెపొచ్చు. . గతంలో గుమ్మకోట గురుకుల పాఠశాలలో రాష్ట్ర గురుకులాల సెక్రటరీ పరిశీలించి, నాడు నేడు నిధులతో అరకొరగా పనులు చేసి నిధులు దుర్వినియోగం జరిగినట్లు నివేదిక అందించారు. అనంతరం దానికి బాధ్యులైన ప్రిన్సిపల్‌పై కూడా చర్యలు తీసుకున్నారు.

ఇప్పుడు అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ కూలియింది. నాడు నేడు నిధులతో నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణాలోపం కారణంగానే నాసిరకంగా పనులు జరగడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడునేడు పనులను చేపడుతుంటే, క్షేత్రస్థాయిలో ఇంతగా నిర్లక్ష్యం ఉండడంపై పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రహరీ కూలినపుపడు అక్కడ ఎవరైనా ఉంటే పరిస్థితి ఏమిటని స్థానికులు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు


కూలిపోయిన అనంతగిరి పిహెచ్‌సి ప్రహరీ

పూర్తిస్థాయి పర్యవేక్షణ నిర్వహిస్తే తప్ప ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకానికి న్యాయం జరగదని అంటున్నారు. ఈ విషయంలో బాధ్యులైన కాంట్రాక్టర్‌తోపాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటే మున్ముందు ఇటువంటి ఘటనలు పునరావృతం కావని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



రేఖపల్లిలో కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి –యంత్రాంగం

విఆర్.పురం: ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ముద్రించిన క్యాలెండర్, డైరీ, అధ్యాపక దర్శిని, స్టిక్కర్ క్యాలెండర్లను మండలంలోని రేఖపల్లి విద్యావనరుల కేంద్రంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.నాగేశ్వరరావు చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ప్రపంచంలోనే శక్తివంతమైన వ్యక్తి అని, అందువల్ల తన విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమాజానికి మార్గదర్శకంగా ఉండటానికి యుటిఎఫ్ పత్రికను కచ్చితంగా చదివి సమాజ పోకడలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వెంకట్, ప్రధానకార్యదర్శి ఎన్.జగదీశ్, నాయకులు ఎన్.రామకృష్ణ, ఎం.బాబు, ఎస్.అజయ్, ఎన్.ప్రసాద్, ఒ.మంగారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎన్.ప్రసాద్ కె.రమేష్, సిహెచ్.వెంకన్నబాబు, అర్జున్, రమేష్, వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, రమణబాబు, కె.తులసి వరలక్ష్మి, టి.ప్రియాంక, శారద, ఎం.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో యుటిఎఫ్ 2023 సంవత్సర కేలండర్, డైరీలను ఎంపిడిఒ వి నగేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం, సేవా కార్యక్రమాల్లో యుటిఎఫ్ సేవలు ప్రశంసనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా యూనియన్ కార్యదర్శి కె.రఘునాథ్ , మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, ఎస్ కన్నయ్య, జిల్లా నాయకుడు టి సుబ్బారావు, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, మోహన్, కోశాధికారి ఎం చంద్రరావు, జి దుక్కు పాల్గొన్నారు

ఎపిటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

హుకుంపేట : మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ డైరీ, కేలండర్‌ను ఎంఇఒ ఎస్.రామచంద్రరావు సంబంధిత ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ, ఉపాధ్యాయ, విద్యా సమస్యలపై ఎపిటిఎఫ్ పోరాటాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ ఉపాధ్యాయులు కోడా ఈశ్వరరావు. బి చిన్నారావు, జిల్లా కార్యదర్శి ఎస్ ప్రభాకర్, మండల జనరల్ సెక్రెటరీ గౌరవాధ్యక్షులు మోదకొండ, జిల్లా కౌన్సిలర్ దొర, సత్యారావు, ఆనంద్, నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



డుంబ్రిగూడలో యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ


శిక్షణ పొందుతున్న గిరిజన డ్వాక్రా మహిళలు

డ్వాక్రా మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి –జి.మాడుగుల : మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ నిట్టమామిడి గ్రామంలో మంగళవారం 30 మంది డ్వాక్రా గ్రూపు మహిళలలకు నాబార్డ్ ఆర్థిక సహకారంతో మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద పదిరోజుల శిక్షణనివ్వనున్నట్లు నాబార్డు డిజిఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ శిక్షణలో రైతులు తాము పండిస్తున్న అల్లం, సేకరిస్తున్న ఉసిరి, ఇతర అటవీ ఉత్పత్తులు, పంటలను వెంటనే అమ్ముకోకుండా, వాటిని నిల్వ ఉంచడం ద్వారా సరైన ధర వచ్చేటప్పుడు అమ్ముకునేందకు వీలుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,మార్కెటింగ్ అవకాశాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో స్మైల్ రిసోర్స్ సభ్యులు చిన్నమ్మి, బాలకృష్ణ సింహాచలం , పలు డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

ప్రతిపక్షాలను అణగదొక్కేందుకే ర్యాలీలపై నిషేధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భద్రత పేరిట, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న నెపంతో రాష్ట్రంలో పోలీస్ యాక్టు 30ని అమలు చేయడం దారుణమని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ సభలు, ర్యాలీలపై నిషేధం విధించడం చూస్తుంటే రాష్ట్రంలో సిఎం జగన్ ప్రజాస్వామ్యానికి పాతరేసినట్టే ఉందని ఎద్దేవా చేశారు. ఇంట్లో ఎలుకలు ఉన్నాయిగనుక ఇంటినే తగులబెట్టినట్టు ప్రమాదాల సాకు చూపించి ప్రతిపక్ష పార్టీలు నిరసనకు దిగకూడదని, రాజకీయ పార్టీలేవీ నిరసనలు చేపట్టకూడదని ప్రభుత్వం చెబుతుండడం చూస్తుంటే ఇది ప్రభుత్వం పన్నిన పన్నాగంగానే భావించాల్సి వస్తోందన్నారు.


భూ రీసర్వే పద్ధతిని అడిగి తెలుసుకుంటున్న సర్పంచ్ పున్నమ్మ

జోరుగా సమగ్ర భూ రీసర్వే

ప్రజాశక్తి –అనంతగిరి : మండలంలో సమగ్ర భూరీసర్వేను వేగవంతం చేసి, సక్రమంగా పూర్తి చేయాలని కొండిభ సర్పంచ్ పి. పున్నమ్మ కోరారు. మంగళవారం కొండిభ పంచాయతీ పరిధి గరిగుడి గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వేలో పాల్గొని స్వయంగా పరిశీలించారు రీసర్వే జరుగుతున్న తీరుపై మోనటరింగ్ బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో భూములను ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సర్వే పూర్తి చేసి, పాసుపుస్తకాలను అందజేయాలని కోరారు. ఇదే సమయంలో రైతులు కూడా తమ వద్దనున్న భూముల వివరాలు, ఇతర ఆధారాలతో సర్వేలో పాల్గొని, తమ భూములు ఎక్కడున్నాయో చూపించి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ ముసురు, సచివాలయ సర్వేయర్లు కృష్ణ, కృష్ణంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జగదీశ్వరరావు

ప్రజాశక్తి–లీగల్ విలేకరి : విశాఖ ప్రధాన జిల్లా న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కాండ్రేగుల జగదీశ్వర్‌రావును నియమిస్తూ ఎపి హోం (కోర్ట్స్) డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హెచ్‌కె.గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జగదీశ్వరరావుకు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, బార్ కౌన్సిల్ మెంబర్లు బైపా కృష్ణమోహన్, నరసింహారావు, వైస్ చైర్మన్ రామ జోగేశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తులసీదాస్ అభినందనలు తెలియజేశారు.


చర్చలు జరుపుతున్న అల్లూరి జిల్లా ప్రతినిధులు

సిఐటియు రాష్ట్ర మహాసభలో

అల్లూరి, రంపచోడవరం జిల్లాల ప్రతినిధులు

భీమవరంలో తలపెట్టిన సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతోంది. కార్యదర్శి నివేదికపై మంగళవారం అల్లూరి సీతారామరాజు, రంపచోడవరం జిల్లాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వేదిక పైనుంచి రిపోర్టు చేశారు. కార్మిక రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన పోరాటాలపై రోజంతా చర్చ సాగింది.


చర్చలు జరుపుతున్న రంపచోడవరం జిల్లా ప్రతినిధులు

సావిత్రిబాయి పూలేకు ఘననివాళి

సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. భారత తొలి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని వక్తలు కొనియాడారు.

అనంతగిరి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలికల ఆశ్రమోన్నత పాఠశాల–2లో హెచ్‌ఎం బి.మంగ, బాలికల ఆశ్రమపాఠశాల–1లో జి.మల్లేశ్వరి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రబాయి పూలే సేవలను కొనియాడారు.

హుకుంపేట:మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పౌర స్వచ్ఛంద సంస్థ, గిరిజన సంఘం అధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం కార్యదర్శి టి.కృష్ణారావు మాటాడుతూ .భారత తొలి మహిళా ఉపాధ్యాయినిగా, సామాజిక వైతాళికురాలిగా, బాలిక విద్య, సాంఘిక దురాచారాలు,సతి సహగమనం,బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలపై ఉద్యమించిన ఉద్యమకారిణిగా సావిత్రి బాయి పూలే చేసిన త్యాగాలు ఆదర్శనీయమన్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి టి.అప్పలకొండపడాల్, హెచ్‌ఎం జె..లంబన్న, పిహెచ్‌సి డాక్టర్ సమాన, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు : దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపల్ డిఎస్ శంకరరావు, చిట్రాయిపుట్టు ప్రాథమిక పాఠశాలలోనూ ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే సేవలను స్మరించుకున్నారు.

మహిళల విద్యాభివృద్ధికి కృషి

చింతూరు : సామాజిక విప్లవకారిణి, దేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలేని స్ఫూర్తిగా తీసుకొని మహిళల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు మడకం గిరిజ అన్నారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా మండలంలోని చిడుమూరు గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజ మాట్లాడుతూ భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో ఆ నాడే బాలికలకు విద్యను నేర్పేందుకు పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. సాంఘిక దురాచారాలను ఎదుర్కొనేందుకు బాలిక విద్య అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా నేటికీ


ఐద్వా ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బాలికల విద్య 64శాతం మాత్రమే ఉందని, అనేక రాష్ట్రాల్లో ఇది 50శాతంగా ఉందని తెలిపారు. మహిళ విద్య అభివృద్ధి జరిగితేనే దేశం సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొడ్డు నాగమణి, గాడిగా, గంగమ్మ, బొడ్డు మొత్తం బుగ్గ లాలమ్మ, సౌలం రజిని సౌలం వీరమ్మ, పాండు దూలమ్మ, మడకం కన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.వెంకట్రావు సావిత్రి బాయిపూలే జీవితం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎమ్.శేఖర్, వై.పద్మ, కె.శకుంతల, ఎస్.అప్పనమ్మ, ఎమ్.నాగమోహనరావు, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, సి.హెచ్. రాజబాబు, నునే రమేష్, ఆర్.మౌనిక, పి.ఏడుకొండలు, జి సాయికుమార్, పి.గౌతమీ, వై.ఇమ్మానుయేల్, అలువేలు మంగతాయారు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపిపి ఆదర్శ పాఠశాలలో...

రాజవొమ్మంగి : స్థానిక ఎంపీపీ ఆదర్శ పాఠశాలలో హెచ్‌ఎం మైలబోయిన రాంబాబు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, ప్రసన్న మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పలువురు విద్యార్థినులు సావిత్రిబాయి పూలే వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎల్ కొండబాబు, కె లక్ష్మమ్మ, కె విగ్నేశ్వరరావు, కె లోవరాజు, జె హరినాథ్, టి లక్ష్మి, కె మంగాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.


సాధన చేస్తున్న క్రీడాకారులు

క్రీడా సాధన ప్రారంభం

ప్రజాశక్తి - సీలేరు

కాకినాడలో ఈనెల 5న నిర్వహించనున్న రాష్ట్ర ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో సీలేరు ఎపి జెన్‌కోకు చెందిన క్రికెట్ క్రీడాకారులు పాల్గొంటారని ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. తను జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఏపీ జెన్కో, ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే క్రీడాకారులు ఆటతీరులో నైపుణ్యతను పెంపొందించుకోవడానికి సీలేరు క్రీడామైదానంలో మంగళవారం ప్రాక్టీస్ చేసినట్లు వెల్లడించారు. స్థానిక క్రీడాకారుడు కె.ఉమామహేశ్వరరావు జట్టుకు తాత్కాలిక కోచ్‌గా వ్యవహిస్తూ బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పించారు. మంగళవారం జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్లో ఏపీ జెన్కో ఎఇ సురేష్, కార్మికులు ఎస్.నాగేశ్వరరావు, భీమరాజు వరప్రసాద్ తదితరులు చక్కటి ఆట తీరని కనబర్చినట్లు తెలిపారు. రాష్ట్ర ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో సీలేరు జట్టు విజయ కేతనం ఎగరవేస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, ఆధార్ కొత్త కార్డులు నమోదు, ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకోవడానికి చక్కటి అవకాశమని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీకే వీధి మండలానికి చివర ప్రాంతమైన సీలేరు ప్రాంత ప్రజలు ఆధార్ సేవలు పొందాలంటే జీకే వీధి, చింతపల్లి మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ చొరవతో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారం రోజులు పాటు సీలేరు ఆధార్ సెంటర్‌ను కొనసాగిస్తామన్నారు.

నేడు సీలేరులో గ్రామసభ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు గ్రామపంచాయతీలో బుధవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ గ్రామసభకు అన్ని శాఖల అధికారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. గ్రామ సభలో జగనన్న స్వచ్ఛ సంకల్పం, మలేరియా నివారణ, జాగ్రత్తలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తాగునీటి సమస్య తదితర వాటిపై చర్చించడం జరిగిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి–రాజవొమ్మంగి : మండలంలోని సూరంపాలెం గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న, చెల్లి గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని వంచంగి పంచాయతీ, జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రెడ్డి రాంబాబు, ఆయన చెల్లి ఆక్కమ్మతో కలిసి ద్విచక్రవాహనంపై శరభవరం గ్రామం నుండి రాజవొమ్మంగి వైపు వస్తున్నారు. రాజవొమ్మంగి నుండి కాకరపాడు వైపు వెళుతున్న ఆటోని తప్పించబోయి మోటార్ బైక్ అదుపు తప్పి పడిపోవడంతో రాంబాబు కుడికాలిపై తీవ్ర గాయమైంది. అక్కమ్మ కాళ్లపై స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సమాచారంతో క్షతగాత్రులను 108 వాహనంలో రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పీహెచ్సీ వైద్యాధికారి శ్రీదుర్గా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రులకి తరలించారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి–రాజవొమ్మంగి : మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో కె బాపన్నదొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి–మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెంలోని ఫోర్‌బై డ్యామ్ వద్ద మంగళవారం జరిగిన చింతూరు ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. సీనియర్ పాత్రికేయులు చెదలవాడ విజయ్ కుమార్, షేక్ షాజహాన్, భాస్కరాచారి, చంటి, మాజీ అధ్యక్షుడు సౌకత్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ పాత్రికేయులు మంత్రి సత్యనారాయణ, కార్యదర్శిగా పరకుశం ప్రేమ్ నాథ్, ఉపాధ్యక్షుడుగా రమణ, సంయుక్త కార్యదర్శిగా వేగి రాజా, కోశాధికారిగా జీవన్, కమిటీ సభ్యులుగా విజయకుమార్, షాజహాన్, బెజవాడ నరేష్, పెరుమాళ్ దేవుడు, శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్ఎఒబి ఎస్‌డిసిగా జ్ఞానవేణి

ప్రజాశక్తి–అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి జిల్లా ఎన్ఎఒబి ఎస్‌డిసిగా కె.జ్ఞానవేణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం జిల్లాలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపిఎమ్‌గా ఎంఎస్.కళావతి, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసిగా ఎం.సత్యపద్మ, స్టీల్‌ప్లాంట్ ఎస్‌డిసిగా వెంకట సత్యసాయి రామమోహనరావు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులో గిరిజన సంక్షేమశాఖ ఎస్‌డిసిగా మద్దిపాటి వెంకట రత్న సాయిబాబాను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

పింఛన్ పెంపు పేరిట మోసం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వృద్ధులకు, వితంతువులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను తాను అధికారంలోకి వస్తే రూ.3 వేలకు పెంచి ఇస్తానని చెప్పిన సిఎం జగన్ మోహన్ రెడ్డి దాదాపు నాలుగేళ్లపాటు రూ.3 వేలు పెన్షన్ ఇవ్వకుండా దశలవారీగా పెంచుతున్నట్లు చెప్పి మోసగించారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ విమర్శించారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రూ.250 పెంచుతూ పింఛను రూ.2750 ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. మార్కెట్లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలూ ఎన్నోరెట్లు పెరిగాయని, పెన్షన్ పెంపుదల ఉన్నప్పటికీ అది ఏమాత్రమూ సరిపోదని అన్నారు. ధరలను అదుపు చేయడం చేతకాక ప్రజలను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు జగన్ గురి చేశారని మండిపడ్డారు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రె పెన్షన్‌ను ఒకేసారి ఐదు రెట్లు పెంచి రూ.1000 ఇచ్చారని, 2018 నవంబర్ నుంచి దీనిని రూ.2 వేలు చేశారని గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇచ్చిన దానికి పది రెట్లు పెంచి పెన్షన్ ఇచ్చారన్నారు. అప్పట్లో నిత్యావసర వస్తువుల ధరలు కూడా చాలా తక్కువగా ఉండేవన్నారు. అందువల్ల రూ.2 వేలుతో భరోసా ఉందన్నారు. ఇప్పుడు ఆ భరోసా లేదని తెలిపారు. అందుకే రాజమండ్రిలో పెన్షన్ల పేరుతో జరిగిన సభలో సిఎం జగన్ పాల్గొనగా.. ఆయన ప్రసంగిస్తూ ఉండగానే లబ్ధిదారులు ఉండకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. ఒక్కసారి అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు జన్మలో మళ్లీ సిఎం అయ్యే యోగం లేదని జోష్యం చెప్పారు.